

సాక్షి
బాపట్ల
శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 41.7333 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 4,485 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 2,200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద 2,212 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1,376 క్యూసెక్కులు విడుదలయ్యాయి.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

30 రోజుల టెన్త్ కార్యాచరణ సిద్ధం

జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల కోసం రివిజన్, స్లిప్ టెస్టులను నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ గురువారం తెలిపారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగన్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఎఫ్ఏ-3, 4, ప్రీ-ఫైనల్ పరీక్షల తేదీలు మినహా ఏప్రిల్ 2వ తేదీ వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల వారీగా అన్ని సబ్జెక్టులకు తయారు చేసిన 30 రోజుల కార్యాచరణ ప్రణాళికను డీఈవోజీఎస్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు ఆయా సబ్జెక్టులు, తేదీల వారీగా 10వ తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన ప్రణాళికలు అమలుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రెండో రోజు ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ



నెహ్రూనగర్(గుంటూరు): వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ రెండో రోజు ఉత్సాహంగా సాగింది. జిల్లాలో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్‌లు అందజేశారు. లబ్ధిదారుల వేలిముద్రలు, ఐరీష్ ఆధారంగా పింఛన్ నగదు పంపిణీ చేశారు. గుంటూరు జిల్లాలో రెండో రోజుతో 94.15 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,53,754 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.69.68 కోట్లు కేటాయించింది. బుధవారం సాయంత్రానికి 2,38,909 మంది లబ్ధిదారులకు రూ.65.62 కోట్ల నగదు అందజేశారు.

నేడు సాయి మందిర 17వ వార్షికోత్సవం

మంగళగిరి: పెదవడ్లపూడిలో వేంచేసిఉన్న భగవాన్ షిరిడీ సాయిబాబా మందిరం 17వ వార్షికోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పాతూరి నాగభూషణం తెలిపారు. గురువారం ఆయన సాయి మందిరం వార్షికోత్సవ ఏర్పాట్లను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 5:30 గంటలకు కాగడ హారతి, 6:00 గంటలకు క్షీరాభిషేకం, 8 గంటలకు బాబాకు అన్నాభిషేకంతో పాటు ఉదయం 9 గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, సినీ సంగీత గాయనీ, గాయకులతో సంగీత విభావరి, జబర్దస్త్ కామెడీ షో కళాకారులతో హాస్యవల్లరితో పాటు డూప్‌స్టార్స్, మిమిక్రీ, మ్యూజిక్ షో కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. సాయి మందిర వార్షికోత్సవానికి పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి సేవలో పాల్గొని బాబా కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి రాక

తాడికొండ: ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి శుక్రవారం రాజధాని ప్రాంతంలో పర్యటించనున్నట్లు ఏపీ సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:45 గంటలకు రాయపూడి గ్రామంలోని ఈ-హెల్త్ సెంటర్లు, కురగల్లులోని అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణాలను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 566.10 అడుగుల వద్ద ఉంది. ఇది 246.7898 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 9,700, ఎడమ కాలువకు 8,280, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 8,550, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 28,650 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి వచ్చే నీరు పూర్తిగా నిలిచిపోయింది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 838.30 అడుగుల వద్ద ఉంది. ఇది 59.3974 టీఎంసీలకు సమానం.

సమర్థంగా భూముల రీ సర్వే

జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు



మాట్లాడుతున్న జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు

బాపట్ల: ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ గడువులోగా భూముల రీ సర్వేని సమర్థంగా చేపట్టాలని జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు ఆదేశించారు. భూముల రీ సర్వేపై జిల్లాలోని డిప్యూటీ సర్వేయర్లు, మండల సర్వేలతో గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. భూముల సర్వే, రెవెన్యూ దస్త్రాల స్వచ్ఛీకరణ పక్కాగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియ సంతృప్తి స్థాయిలోనే కొనసాగుతుందన్నారు. సర్వే డీటీలు మరింత అవగాహన పొందాలని సూచనలు చేశారు. దశలవారీగా చేపడుతున్న రీ సర్వేలో సర్వేయర్లు పొరపాట్లు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియపై పూర్తిస్థాయి అవగాహన కలిగి మెలకువగా విధులు నిర్వహించాలని చెప్పారు. సవరణలపై దృష్టి సారించాలన్నారు. మొదటి, రెండవ దశలలో ప్రభుత్వ నిర్దేశించిన గడువులోగా ఆయా గ్రామాలలో సర్వే పూర్తి చేయాలని మార్గనిర్దేశం చేశారు. జిల్లాలోని 13 మండలాలలో జగనన్న భూరక్ష పథకం కింద భూముల రీ సర్వే జరుగుతుందని జేసీ తెలిపారు. మొదటి దశలో 24 గ్రామాలను ఎంపిక చేయగా, అందులోని 82,698 ఎకరాలు సర్వే పూర్తి చేశామన్నారు. ఆ భూములకు భూ హక్కు పత్రాల పంపిణీ ప్రక్రియ క్షేత్రస్థాయిలో కొనసాగుతుందన్నారు. రెండో దశలో జిల్లాలో 23 గ్రామాలను ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ఎనిమిది గ్రామాలలో ఇప్పటికే డ్రోన్ ద్వారా భూముల చిత్రాల చిత్రీకరణ ప్రక్రియ పూర్తయిందన్నారు. 29,526 ఎకరాలకు ప్రాథమిక సర్వే పూర్తి జరిగిందన్నారు. మిగిలిన 15 గ్రామాలలో 54 వేల ఎకరాలలో డ్రోన్ చిత్రాలు తీస్తుందన్నారు. 200 మంది మండల, గ్రామస్థాయి సర్వేయర్లు సర్వే చేస్తున్నారని వివరించారు. వీఆర్వోలు ప్రతి రోజూ కనీసం 50 ఎకరాలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. ముందస్తుగా గ్రామ సభ ఏర్పాటు చేసిన తదుపరి గ్రౌండ్ ట్రూతింగ్ నిర్వహించాలన్నారు. పీఓఎల్ఆర్, పీఓటి, డీఎల్ఆర్ ప్రకటనలలో జాప్యం ఉండరాదని సూచించారు. 15 రోజుల్లో డీఎల్ఆర్ నివేదిక జేసీ లాగిన్‌కు పంపాల్సి ఉందన్నారు. క్షేత్రస్థాయిలో విభేదాలు ఉన్న భూములను గుర్తించి, సంబంధిత రైతులకు ముందస్తు నోటీసులు జారీ చేయాలన్నారు. స్థిరమైన ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలను విధిగా పాటించాల్సి ఉందన్నారు. సర్వేయర్లు బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో భూ సర్వే, రికార్డుల సహాయ సంచాలకులు కె.మురళీకృష్ణ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, డిప్యూటీ సర్వేయర్లు, మండల సర్వేలు పాల్గొన్నారు.

సాహితీ సేద్యంలో దిట్ట



సీ నారాయణరెడ్డి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న డీవీఎం సత్యనారాయణ



బాపట్ల జిల్లా రచయితలతో సత్కారం అందుకుంటున్న సత్యనారాయణ

- పురాతన గ్రంథాలకు సంస్కృతం నుంచి అనువాదం
- పలు పత్రికల్లో వ్యాసాలు ప్రచురణ
- పద్య రచనలో రాణిస్తున్న సత్యనారాయణ

అద్దంకి: చదివింది ఫిజిక్స్‌లో ఎమ్మెస్సీ.. చేస్తుంది జీవిత బీమా సంస్థలో చిరుద్యోగి, ప్రవృత్తి సాహిత్య సేవ. అయితేనేం జోడు గుర్రాల సారథిగా అటు జీవిత బీమా సంస్థ ద్వారా సమాజానికి సేవలందిస్తూ మరో వైపు శతకాలు, పురాతన గ్రంథాలకు భాష్యం రాయడంతోపాటు, రేడియో ప్రసంగాలు, దిన పత్రికల్లో సాహితీ వ్యాసాలు రాస్తూ సాహిత్య సేవ చేస్తున్నాడు. ఇప్పటికి పది గ్రంథాలకు పైగా రచించారు. యువకునిగా ఉన్న సమయంలోనే నాగభైరవ, సీ నారాయణరెడ్డి, భూసురపల్లి వెంకటేశ్వర్లు, వంటి వారిచే ఔరా అనిపించుకుని ప్రశంసలందుకున్నాడు. అయనే దిట్టకవి డీవీఎం సత్యనారాయణ ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామానికి చెందిన దొడ్డవరం వెంకట సుబ్బరామయ్య, లలితమ్మల కుమారుడు డీవీఎం సత్యనారాయణ. వీరిది వ్యవసాయ కుటుంబం, తండ్రి ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. వీరి కుటుంబం అద్దంకిలో స్థిరపడింది. ఎనిమిదో తరగతి చదివే సమయంలో మైనంపాటి వరప్రసాదరావు స్ఫూర్తితో (1983) సత్యనారాయణ సాహిత్యం పట్ల మక్కువ పెంచుకుని వచన కవితలు రాయడం మొదలు పెట్టారు. ఇంటరు చదివే సమయంలో పద్య రచనవైపు అడుగులు వేశాడు. ఒక సాహిత్య కార్యక్రమం కోసం అద్దంకి వచ్చిన నాగభైరవ కోటేశ్వరరావు డీవీఎం ప్రతిభ చూసి ముగ్ధుడై ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. నాగభైరవ సూచన మేరకు పద్య రచన ప్రారంభించాడు. 150 పద్యాలు రాశాడు.

రచనలు..

పెద్దల స్ఫూర్తితో జగద్గురువు ఆది శంకరాచార్యులు రచించిన భజగోవిందం గ్రంథ శ్లోకాలను తెలుగులోకి అనువదించారు. 1వ శతాబ్దంలో హాలుడు రచించిన ఆంధ్ర గాథా లహరిలోని కథలను తెనిగించి సాధారణ ప్రజలు చదువుకునే విధంగా రచించాడు. మూడు పుస్తకాలు ముద్రించబడ్డాయి. వీటితోపాటు పద్య కవితా సంపుటి పద్యమంజరి, కవితా కదంబం, వ్యాస సంపుటి వ్యాస మంజూష, ప్రకృతి గీతం(రుతువర్ణన), సంకీర్తనావళి, శ్రీకష్ణ రింఛోళి సదుర్తి రత్నావళిని అనువాదం చేశారు. విశేషంగా 1989లో తన 27వ ఏట విజయవాడ, మార్కాపురం ఆకాశవాణి కేంద్రాల్లో సరస వినోదిని సమస్యా పూరణం కార్యక్రమ నిర్వహణ, విళంబి నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనంలో సాహితీ ప్రసంగం, సాక్షి (సాహిత్య మరమరాలు)తోపాటు పలు దిన పత్రికల్లో ఆంధ్ర గాథా లహరి, శ్రీ కష్ణ రింఛోళి ధారావాహికగా ప్రచురించారు. ఆకాశవాణి వారు నిర్వహించిన భావ చిత్రాలులో ప్రథమ బహుమతిని పొందారు. ప్రకాశం జిల్లా రజితోత్సవ సంచికకు సంపాదకత్వం వహించారు.

పురస్కారాలు..

- 2018లో ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య ఒంగోలు వారిచే గిడుగు ప్రతిభా పురస్కారం.
- 2022లో డాక్టర్ నాగభైరవ, డాక్టర్ మండువ నరసింహారావు జాతీయ సాహిత్య ప్రతిభ పురస్కారాలు
- 2022లో బాపట్ల జిల్లా రచయిత సంఘం వారి నుంచి ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ఎల్ఐసీ ఉద్యోగిగా పనిచేస్తూ, తెలుగుపై ఉన్న మక్కువతో పద్య ప్రక్రియను నేటి తరం మరువకుండా ఉండేందుకు యూ ట్యూబ్ చానల్ ద్వారా పద్యాలను అందిస్తూ సాహిత్యవేత్తల ప్రశంసలు అందుకుంటున్నాడు డీవీఎం సత్యనారాయణ.

హోరాహోరీగా సాక్షి ప్రీమియర్ లీగ్



మ్యాచ్‌లో తలపడుతున్న ఒంగోలు క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ-2, ఇంకొల్లు డీసీఆర్ఎం డిగ్రీ కాలేజీ జట్లు

ఒంగోలు: ఒంగోలు మినీ స్టేడియంలో బుధవారం ప్రారంభమైన సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు రెండోరోజైన గురువారం కూడా ఆసక్తికరంగా సాగాయి. మ్యాచ్‌లను తిలకించేందుకు పెద్ద ఎత్తున క్రికెట్ అభిమానులు విచ్చేశారు. 46 బౌండరీలు, 10 సిక్సర్లతో క్రీడాకారులు ఉత్సాహపరిచారు. తొలి మ్యాచ్‌లో డీసీఆర్ఎం ఇంకొల్లు-ఒంగోలు క్విస్ కాలేజీ-2 జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన డీసీఆర్ఎం జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా క్విస్ జట్టు 81 పరుగులు చేసింది. వాటిలో బ్యాట్స్‌మన్ సాధించిన పరుగులు 44 కాగా, మిగిలిన 37 పరుగులు అదనపు పరుగులే కావడం గమనార్హం. 82 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన డీసీఆర్ఎం జట్టు 9 ఓవర్లలో 69 పరుగులకే ఆలౌటైంది. పవన్ కళ్యాణ్ అనే క్రీడాకారుడు రెండు బౌండరీలు, రెండు సిక్సర్లతో 19 బంతుల్లో 27 పరుగులు చేయడంతో కొద్దిసేపు ఉత్కంఠ కొనసాగింది. రెండో మ్యాచ్ ఒంగోలు పేస్ ఇంజినీరింగ్ కాలేజీ-చీరాల సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీ జట్ల మధ్య జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన సెయింట్ ఆన్స్ జట్టు.. నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 7 బౌండరీలు, రెండు సిక్సర్లతో 76 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన పేస్ కాలేజీ జట్టు 9 బౌండరీలు, 2 సిక్సర్లతో 9 ఓవర్లలోనే 78 పరుగులు చేసి 5 వికెట్ల తేడాతో విజయాన్ని కైవసం చేసుకుంది.

ఢిల్లీలో కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ఒంగోలుఅర్బన్: కేంద్ర ప్రభుత్వం అందించే ప్రధాన మంత్రి అవార్డుల కోసం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆయన సతీమణి, బాపట్ల జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్‌తో కలిసి ఢిల్లీ వెళ్లి స్క్రీనింగ్ కమిటీ వద్ద గురువారం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, వినూత్న ఆలోచనలతో చేసే పనులపై ఢిల్లీలోని సివిల్ సర్వీసెస్ ఆఫీసర్స్ ఇనిస్టిట్యూట్‌లో స్క్రీనింగ్ కమిటీ ముందు ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో స్ఫూర్తి నింపడంతోపాటు ఉత్తమ భవిష్యత్తుకు వారికి అవసరమైన సూచనలు చేయడం, పల్లె నిద్ర వంటి కార్యక్రమాలపై కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.



ఢిల్లీలో ప్రకాశం, బాపట్ల జిల్లాల కలెక్టర్లు దినేష్‌కుమార్, విజయకృష్ణన్ దంపతులు

ఉచితంగా రేషన్ బియ్యం

- ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా బియ్యం పంపిణీ
- జిల్లాలో 12.97 లక్షల మందికి లబ్ధి
- లబ్ధిదారుడికి 5 కిలోల చొప్పున అందజేత
- నెలకు 64,875 క్వింటాళ్ల బియ్యం పంపిణీ
- కిలో బియ్యం రూ. 41 చొప్పున కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం
- నెలకు రూ. 26.6 కోట్లు చొప్పున ఏడాదికి రూ. 319.2 కోట్లు చెల్లిస్తున్న ప్రభుత్వం



బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

బాపట్లటౌన్: ప్రభుత్వం పేదల విషయంలో మరో సాహసోపేత నిర్ణయం తీసుకుంది. పేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా సరఫరా చేసే బియ్యాన్ని ఉచితంగా అందజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జనవరి నెల నుంచి దీనిని అమలుచేస్తున్నారు. గతేడాది డిసెంబర్ వరకు కిలోకి రూపాయి తీసుకొనే వారు. జనవరి నుంచి బియ్యం పూర్తి ఉచితంగా అందజేస్తున్నారు. ప్రతి నెలా 64,875 క్వింటాళ్ల బియ్యాన్ని ఎండీయూ వాహనాల ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. పంచదార, కందిపప్పులకు మాత్రమే డబ్బులు వసూలు చేస్తున్నారు. కేజి కందిపప్పుకు రూ. 67, అరకిలో పంచదారకు రూ.17 తీసుకొని బియ్యం ఉచితంగా అందిస్తున్నారు. అంత్యోదయ కార్డుదారులకు కేజి పంచదార రూ.13.50కే అందిస్తున్నారు.

జీపీఎస్ ద్వారా పక్కాగా సరఫరా

పేదలకు రేషన్ సరుకులు పక్కా అందించాలనే ఉద్దేశంతో పక్కా ప్రణాళికను రూపొందించింది. జిల్లాలో 294 మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఎండీయూ) ద్వారా రేషన్ అందజేస్తోంది. మరింత పారదర్శకంగా అందించేందుకు ఎండీయూ వాహనాలకు జీపీఎస్ తో అనుసంధానం చేశారు. ప్రభుత్వం ఇంటింటికి వాహనాల ద్వారా రేషన్ సరుకులు సరఫరా చేయడం తోపాటు ఈ ఏడాది నుంచి బియ్యాన్ని ఉచితంగా అందించడం పట్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చాలా సంతోషంగా ఉంది



బియ్యం ఉచితంగా అందించడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి మాలాంటి పేదలకు ఎంతో మేలు చేసేలా మంచి నిర్ణయాలు తీసుకుంటున్నారు.

–పి.వరలక్ష్మి, చెరుకుపల్లి

మంచి పనులు చేస్తున్నారు



రాష్ట్రంలోని పేదలను దృష్టిలో పెట్టుకొని చాలా మంచి పనులు చేస్తున్నారు. గతంలో ఇలాంటి పాలనను నేను చూడలేదు. రెండు నెలల నుంచి బియ్యానికి ఒక్క రూపాయి కూడా తీసుకోవడం లేదు.

– మేకా సుందరమ్మ, శారదపురి కాలనీ

ఉచితంగా బియ్యం పంపిణీ



ప్రభుత్వ నిర్ణయంతో కార్డుదారులకు ఉచితంగా బియ్యాన్ని సరఫరా చేస్తున్నాం. కందిపప్పు, పంచదార ఇతర సరుకులకు లబ్ధిదారులు నగదు చెల్లించాలి.

– విలియమ్స్, జిల్లా పౌరసరఫరాల అధికారి

26న గుంటూరులో డాగ్ షో

- దరఖాస్తులకు ఆహ్వానం
- వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన ఐజీ, క్లబ్ సభ్యులు



డాగ్ షో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐజీ త్రివిక్రమవర్మ, రామచంద్రరాజు, లక్ష్మీనారాయణ

నగరంపాలెం(గుంటూరు): గుంటూరు కినల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ గుంటూరు మార్కెట్ సెంటర్‌లోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో 'డాగ్ షో' నిర్వహించనున్నట్లు క్లబ్ గౌరవాధ్యక్షుడు, గుంటూరు రేంజ్ ఐజీ డాక్టర్ సీఎం త్రివిక్రమవర్మ తెలిపారు. గుంటూరులోని రేంజ్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఐజీ మాట్లాడారు. ఉదయం 9 గంటలకు షో ప్రారంభమవుతుందని తెలిపారు. గతంలో కోవిడ్-19కు ముందు గుంటూరు నగరంలో మొట్టమొదటిసారిగా డాగ్ షోను నిర్వహించామని గుర్తుచేశారు. సుమారు 275 మంది దరఖాస్తులు చేయగా, భిన్నమైన జాతి కుక్కలతో యాజమానులు హాజరయ్యారని చెప్పారు. నమ్మకం, ఆప్యాయత, విశ్వాసం అధికంగా కనబరిచే శునకాలకు సంబంధించి మంచి కార్యక్రమం నిర్వర్తించడం అభినందనీయమన్నారు. రానున్న షో ఎంతో ఉత్సాహంగా కొనసాగనుందని తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు పి.రామచంద్రరాజు మాట్లాడుతూ ఆల్ బ్రీడ్ చాంపియన్‌షిప్- డాగ్ షో ప్రవేశ రుసుం (ఎంట్రీ ఫీజు) రూ.500, ముగ్గురికి కూపన్లు అందిస్తామన్నారు. శునకాలకు ఉపయోగపడే మంచి కిట్‌ను కూడా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఆదేరోజు సాయంత్రం 6 గంటలకు శునకాలతో ప్రత్యేక ప్రదర్శన (డాగ్ షో) ఉంటుందని చెప్పారు. కుక్కలకు అవసరమైన చికిత్సా విధానం, పెట్ దుకాణాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందని చెప్పారు. ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తులు అందించాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 97047 93194, 77021 53243 సెల్ నంబర్లలో సంప్రదించాలని కార్యదర్శి ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ తెలిపారు. అనంతరం డాగ్ షోకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

108 ప్రసాదాలతో నివేదన

చినగంజాం: భీష్మ ఏకాదశి సందర్భంగా స్థానిక భావన్నారాయణస్వామి దేవాలయంలో 108 ప్రసాదాలతో భావన్నారాయణునికి నైవేద్యం సమర్పించారు. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు నిర్విరామంగా 108 సార్లు విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కమిటీ సభ్యులు రామానుజం, శివన్నారాయణ, జి.పిచ్చయ్య, వలివేటి కృష్ణ పాల్గొన్నారు.



భావన్నారాయణునికి 108 నైవేద్యాలు సమర్పించిన భక్తులు

లిఫ్ట్‌లను పరిశీలించిన డీఆర్‌ఎం

- తక్షణమే మరమ్మతులు చేయించాలని ఆదేశం
- గుంటూరు రైల్వే స్టేషన్‌లో వేగంగా అభివృద్ధి పనులు
- డీఆర్‌ఎం రామకృష్ణ

సాక్షి ఎఫెక్ట్

లక్ష్మీపురం(గుంటూరు): గుంటూరు రైల్వేస్టేషన్‌లో నెల రోజులుగా 1వ నంబర్ ప్లాట్ ఫారంపైగల రెండు లిఫ్టులు, ఎస్కలేటర్ పనిచేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బుధవారం పనిచేయని లిఫ్టులు, ఎస్కలేటర్లు అన్న శీర్షికతో ప్రచురితమైన కథనానికి గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం రామకృష్ణ స్పందించారు. గురువారం డీఆర్‌ఎం రామకృష్ణ, ఏడీఆర్‌ఎం శ్రీనివాస్, సంబంధిత ఎలక్ట్రికల్ విభాగాధిపతులతో కలిసి రైల్వేస్టేషన్‌లోని 1వ నంబర్ ప్లాట్‌ఫారంపై లిఫ్టులు, ఎస్కలేటర్లను పరిశీలించారు. ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డీఆర్‌ఎం రామకృష్ణ మాట్లాడుతూ లిఫ్టులకు తక్షణమే మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. ఎస్కలేటర్‌లను వినియోగించే సమయంలో ప్రయాణికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కొంతమంది ఎస్కలేటర్‌ను నిలిపివేసి సెల్ఫీలు దిగడం చేస్తున్నారని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైల్వేస్టేషన్‌లోని 1వ నంబర్ ప్లాట్‌ఫారంపై ప్రయాణికుల సౌకర్యార్థం మరో ఎస్కలేటర్ కోసం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం 7 లిఫ్టులు, 5 ఎస్కలేటర్లు ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది మార్చి నెలాఖరులోగా 1వ నంబర్ ప్లాట్‌ఫారంపై మరో ఎస్కలేటర్‌ను సిద్ధం చేస్తామని స్పష్టం చేశారు. 8వ ప్లాట్‌ఫారం వైపు సబ్‌వేలో కూడా లిఫ్ట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.



నూతన ప్లాట్‌ఫారం పనులను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం రామకృష్ణ, ఏడీఆర్‌ఎం శ్రీనివాస్

చేతబడి ఆరోపణలతో వ్యక్తి నిర్బంధం

- పోలీసులను దగ్గరకు రానివ్వని గ్రామస్తులు
- బాధితుడు వైద్యశాలకు తరలింపు


నిర్బంధించిన వ్యక్తి దగ్గరకు వెళ్లడానికి అనుమతించక పోవడంతో ప్రేక్షక పాత్ర వహిస్తున్న పోలీసులు

వేటపాలెం: రామాపురం మత్స్యకార గ్రామంలో చేతబడి చేయించింది ఎవరో చెప్పాలంటూ 60 సంవత్సరాల వ్యక్తిని గురువారం నిర్బంధించారు. తమ గ్రామంలో ఒక ఇంట్లోని వాయిల పోలయ్య, వెంకటేశ్వర్లు ఇద్దరికీ చేతబడి చేయించడం వల్లే అకాల మరణం చెందారనే అనుమానంతో గ్రామానికి చెందిన శేషగిరిరావుని గ్రామస్తులు బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు నిర్బంధించారు. విషయం తెలుసుకున్న చీరాల రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఈపూరుపాలెం ఎస్ఐ జనార్దన్ సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. ఆ వ్యక్తిని పోలీసులకు అప్పగించడానికి ఒప్పుకోలేదు. గ్రామ కట్టుబాటును గౌరవించాలని అడ్డం తిరిగారు. సంఘటనను ఫొటోలు తీయడానికి ప్రయత్నించిన విలేకర్లను కూడా అడ్డుకొన్నారు. మధ్యాహ్నం 1 గంటకు డీఎస్పీ శ్రీకాంత్ వచ్చి గ్రామ పెద్ద కాపులతో చర్చించి శేషగిరిరావుని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

రేపటి నుంచి సీఎం కప్ ఫుట్‌బాల్ పోటీలు

గుంటూరువెస్ట్(క్రీడలు): శాప్ ఆదేశాల మేరకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు సీఎం కప్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తామని స్టెప్ సీఈఓ ఎస్.పల్లవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచిన వారిని ఈనెల 22 నుంచి 26 వరకు తిరుపతిలో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు కె.పాల్‌కుమార్ (సెల్ నెంబర్ 92906 67994)ను సంప్రదించాలన్నారు.

12న బీపీ మండల్ విగ్రహావిష్కరణ

- బీసీల ఆత్మగౌరవ సభ
- రాజ్యసభ సభ్యుడు బీద మస్తానరావు
- బీసీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తానరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

గుంటూరు రూరల్: దేశంలో బీపీ మండల్ నివేదికలను అమలు చేసి బీసీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు బీద మస్తానరావు తెలిపారు. గురువారం నగర శివారుల్లోని ఇన్నర్ రింగ్‌రోడ్డు నందు బీపీ మండల్ విగ్రహావిష్కరణ కమిటీ ఆధ్వర్యంలో బీసీల ఆత్మగౌరవ సభ, బీపీ మండల్ విగ్రహావిష్కరణ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 72 కోట్ల మంది బీసీలు ఉన్నారని కానీ కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖలేదని చెప్పారు. బీపీ మండల్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రానికి విన్నవించారు. అదేవిధంగా బీపీ మండల్ సిఫారసులు మేరకు మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, జనగణన చేపట్టాలని కోరారు. ఈ నెల 12వ తేదీన నగర శివారుల్లోని అమరావతి రోడ్డు ఇన్నర్ రింగ్ రోడ్డు చిల్లీస్ సెంటర్‌లో ప్రతిష్ఠించనున్న బీపీ మండల్ విగ్రహావిష్కరణ, బీసీల ఆత్మగౌరవ సభను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆర్థికంగా సామాజికంగా ఆర్థిక రుగ్మతలను అసమానతలు తొలగించడానికి బీసీల ఆత్మగౌరవ సభను నిర్వహిస్తున్నారన్నారు. బీసీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. బీసీ కమిషన్‌లో ఉన్న సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బోన బోయిన శ్రీనివాస్, కేసన శంకరరావు, ఆలా వెంకటేశ్వరరావు, క్రాంతికుమార్, గోళ్ల శివశంకర్, తాళ్ల వీరయ్య, పలు బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి 66వ స్కూల్ గేమ్స్ ఇన్నర్ డిస్ట్రిక్ట్ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జగ్గయ్యపేటలోని ఉక్కు కళావేదికలో గురువారం నిర్వహించారు. వీటిలో ఎస్ఆర్‌పీఎం హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న టి.రవితేజ పాల్గొని గోల్డ్ మెడల్ సాధించాడు. గతంలోనూ అనేక పోటీలలో పాల్గొని పలు పతకాలు సాధించాడు. విద్యార్థి రవితేజను స్కూల్ హెచ్ఎం ఎ.వెంకటేశ్వరరావు, పీఈటీ కె.రాణి, ఎ.సుందరరామిరెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ పి.సురేష్ అభినందించారు.

తీరం వెంట పోలీస్ ఔట్ పోస్టులు


పోలీస్ ఔట్ పోస్టు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డీఎస్పీ శ్రీకాంత్

వేటపాలెం: చీరాల వాడరేవు నుంచి చిన గంజాం మండలం వరకు తీరంలో ఆరు టూరిస్ట్ పోలీస్ ఔట్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు చీరాల డీఎస్పీ శ్రీకాంత్ తెలిపారు. రామాపురం సముద్రతీరంలో టూరిస్టు పోలీస్ ఔట్ పోస్టు నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల వాడరేవు, రామాపురం, సముద్రతీరానికి దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారని తెలిపారు. వారికి రక్షణ కల్పించడంతోపాటు తగిన సమాచారం అందించడం కోసం ఎస్పీ జిందాల్ ఆదేశాల మేరకు వీటిని నెలకొల్పుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నిర్మిస్తున్న అవుట్ పోస్టు నిర్మాణానికి సీబ్రీజ్ రిసార్ట్స్ యాజమాన్య సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. రూరల్ సీఐ ఏ మల్లికార్జునరావు, ఈపూరుపాలెం ఎస్సై జనార్దన్, మెరైన్ పోలీసులు పాల్గొన్నారు.

టీటీడీ అన్నదానం కోసం మార్టూరు కూరగాయలు

మార్టూరు: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదాన వినియోగం నిమిత్తం మార్టూరు కూరగాయలు తరలివెళ్లనున్నాయి. మార్టూరులోని కూరగాయల వర్తక సంఘం టీటీడీ అన్నదాన నిమిత్తం కూరగాయలు పంపిణీ చేయటానికి అనుమతి కోరుతూ మూడు నెలల కిందట దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 5వ తేదీ మార్టూరు మార్కెట్ నుంచి కూరగాయలు పంపవలసిందిగా టీటీడీ నుంచి సందేశం వచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. అందులో భాగంగా 5వ తేదీ ఉదయం 9 గంటలకు స్వామి వారి కూరగాయల వాహనం మార్టూరు ప్రధాన వీధుల్లో ప్రదర్శనగా బయలుదేరి స్టేట్ బ్యాంక్ సెంటర్‌కు చేరుకుంటుందని దీనిని ఓ ఆధ్యాత్మిక కార్యక్రమంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రైల్వే ఉద్యోగి గృహంలో గంజాయి స్వాధీనం

చినగంజాం: రైల్వే ఉద్యోగి ఇంటిలో గంజాయి దాచి ఉంచారనే సమాచారంతో చినగంజాం పోలీసులు గురువారం సోదాలు నిర్వహించారు. ఎస్ఐ కట్టా అనూక్ అందించిన సమాచారం ప్రకారం.. కడవకుదురు ఎస్సీ కాలనీలో నివాసముంటున్న పంది రవి అనే రైల్వే ఉద్యోగి ఇంటిలో గంజాయి దాచి ఉంచినట్లు సమాచారం అందింది. అప్రమత్తమైన పోలీసులు గురువారం ఉదయం అతని ఇంటికి వెళ్లి సోదాలు నిర్వహించగా వారికి సుమారు 5 కిలోల గంజాయి లభ్యమైంది. కుటుంబ సభ్యులను విచారించిన అనంతరం ఉద్యోగి డ్యూటీలో ఉండగా అదుపులోనికి తీసుకున్నారు. గతంలో రవిపై రైల్వే ప్రయాణికుల నుంచి బంగారం దొంగిలించిన కేసు సహా, పలు కేసులు ఉన్నట్లు సమాచారం. ఇంకొల్లు సీఐ వి.సూర్యనారాయణ చినగంజాం పోలీస్‌స్టేషన్‌లో విచారణ నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బుడంపాడు హత్య కేసులో నిందితుడి అరెస్ట్

గుంటూరు రూరల్: బుడంపాడు గ్రామంలో జరిగిన హత్య కేసులో నిందితుడిని గురువారం నల్లపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం .. బుడంపాడు గ్రామానికి చెందిన చెరుకూరి వేణు (30) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుటాడు. ఈ క్రమంలో అదే గ్రామం వేణు నివసించే వీధికి చెందిన అతని కజిన్ చెరుకూరి జయకృష్ణ నగర శివారుల్లోని ఒక బార్‌లో మద్యం సేవించేందుకు మంగళవారం రాత్రి వెళ్లాడు. అదే సమయంలో వేణు అదే బార్‌లో మద్యం సేవించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో జయకృష్ణకు బార్‌లో వేరే వ్యక్తులకు వివాదం జరుగుతున్న తరుణంలో వేణు జయకృష్ణతో వివాదం పడుతున్న వ్యక్తులకు సపోర్ట్‌చేసి జయకృష్ణను అక్కడినుంచి బయటకు తీసుకెళ్లాడు. దీంతో ఆగ్రహానికి గురైన జయకృష్ణ వేణుతో వివాదానికి దిగాడు. దీంతో వేణు మద్యం తీసుకుని బయటకు వచ్చి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద మద్యం సేవిస్తున్నాడు. అదేవిధంగా కోపంతో ఉన్న జయకృష్ణ మద్యం తీసుకుని గ్రామంలోని పంచాయతీ ఆఫీసు వద్దకు వచ్చి వేణుతో మరలా వివాదానికి దిగాడు. మద్యం మత్తులో వేణుపై తన వద్దనున్న కత్తితో పొడిచి పరారయ్యాడు. దీంతో వేణు అక్కడికక్కడే మృతి చెందగా గ్రామస్తులు, మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు జయకృష్ణను అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరం ఒప్పుకున్నాడన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

ఏప్రిల్‌లో దూరవిద్య టెన్త్, ఇంటర్ పరీక్షలు

గుంటూరుఎడ్యుకేషన్: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ఆధ్వర్యంలో దూర విద్య టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 17వ తేదీ వరకు జరగనున్నట్లు సంస్థ డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ ప్రాక్టికల్స్ ఏప్రిల్ 18 నుంచి 23 వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్షలకు హాజరు కానున్న అభ్యర్థులు ఈనెల ఒకటి నుంచి 15లోపు అపరాధ రుసుం లేకుండా ఏపీ ఆన్‌లైన్ కేంద్రంతోపాటు ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు.

సేవలు సమర్థంగా అందించాలి

- సచివాలయ సిబ్బందికి ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత సూచన
- యర్రబాలెంలో ఆకస్మిక తనిఖీ


యర్రబాలెంలో సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ కె సుజాత

మంగళగిరి: సచివాలయ ఉద్యోగులు వలంటీర్లతో మమేకమై ప్రజలకు సమర్థవంతంగా సేవలు అందించాలని హ్యాండ్‌లూమ్స్, టెక్స్‌టైల్స్ ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత అన్నారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం 3వ సచివాలయాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా సందర్శించి రికార్డులు తనిఖీ చేసి అటెండెన్స్ పరిశీలించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు నిబద్ధతతో తమ ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాలని, సర్వీసెస్‌కు సంబంధించి రెమిటెన్స్ అమౌంట్ ఏ రోజుకు ఆ రోజు క్లియర్ చేసి బ్యాంకులో డిపాజిట్ చేయాలని సూచించారు. సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. సెక్రటరీలు వార్డుల్లో సర్వేలు సక్రమంగా నిర్వహించడంతో పాటు వలంటీర్లను సమన్వయపరుచుకుని ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా యూనిఫాం ధరించి విధులకు హాజరుకావాలన్నారు. విధి నిర్వహణలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు రావాలని, తద్వారా సమస్యల సత్వర పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ హేమమాలినితో పాటు పలువురు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

భూముల రీసర్వేకు ప్రజల మద్దతు

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరువెస్ట్: భూముల రీ సర్వేకు ప్రజలు, రైతుల నుంచి మంచి స్పందన వస్తుందని అందుకే కార్యక్రమం విజయవంతంగా నడుస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జేసీ రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జరగిన రీసర్వే సంతృప్తికరంగా ఉందన్నారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ల్యాండ్ కన్వర్షన్స్ చాలా వరకు క్లియర్ చేశామన్నారు. రబీతోపాటు తుంపర, బిందు సేద్యం కూడా విస్తరణకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. జగనన్న ఇళ్ల పథకంలో భాగంగా ఉగాదికి వీలైనన్ని గృహాలు ప్రారంభిస్తామని చెప్పారు.

సోలార్ పవర్ జనరేషన్ ప్లాంట్ ప్రారంభం


ప్లాంట్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి, వీసీ ఆచార్య పి రాజశేఖర్

ఏఎన్‌యూ: నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన 2 మెగావాట్స్ రూఫ్ టాప్ సోలార్ జనరేషన్ ప్లాంట్‌ను గురువారం కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయంలో కూడా 80 కేవీ సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్ ఛార్జీలు చాలా ఆదా అయ్యాయన్నారు. ఇలాంటి నాన్ కన్వెన్షనల్ ఎనర్జీ వినియోగం వల్ల ఖర్చుతోపాటు కాలుష్యాన్ని కూడా నివారించవచ్చన్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి రాజశేఖర్ ప్రసంగిస్తూ ఏఎన్‌యూకి న్యూఢిల్లీకి చెందిన ఆర్ఈసీ (రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్) సంస్థ సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను మంజూరు చేయడం అభినందనీయమన్నారు. నెడ్‌క్యాప్ సంస్థ ఆ ప్లాంట్ ఏర్పాటు పనులు, నిర్వహణ చేపట్టిందన్నారు. రెక్టార్ ఆచార్య పి వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి కరుణ, ప్రిన్సిపాల్స్ ఆచార్య గంగాధర్, ఆచార్య స్వరూపరాణి, ఆచార్య సిద్ధయ్య, ఓఎస్‌డీ ఆచార్య సునీత, డీఈఈ ఎస్ వెంకటేశ్వరరావు, నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ వి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గ్రానైట్ కార్మికుడు మృతి



బల్లికురవ: బతుకుదెరువుకు రాష్ట్రాలు దాటి వలసవచ్చి గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికుడుగా పనిచేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తి చనిపోయాడు. ఈ ఘటన గురువారం రాత్రి బల్లికురవ–మార్టూరు ఆర్అండ్‌బీ రోడ్డులోని నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలోని శ్రీశక్తి గ్రానైట్ ఫ్యాక్టరీలో జరిగింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన శివరాజ్ (28) నక్కబొక్కలపాడులో నివాసం ఉంటూ గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికుడుగా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా విద్యుత్ షాక్‌కు గురవగా తోటి కార్మికులు మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యం అందేలోపే చనిపోయాడు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన టిప్పర్

- ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం
- నిశ్చితార్థానికి కేక్ తెచ్చేందుకు వెళ్తుండగా ఘటన


ప్రమాదంలో దుర్మరణం చెందిన వినయ్


సంఘటనలో గాయపడ్డ శివభద్రినాథ్

మేడికొండూరు: వారు ఇద్దరు చిన్నప్పటి నుంచి మంచి స్నేహితులు, ఒకే కుటుంబానికి చెందిన బావ, బావమరుదులు ఇంజినీరింగ్ చదుతున్నారు. మరికొద్ది గంటల్లో జరగనున్న తమ బంధువుల అమ్మాయి నిశ్చితార్థ వేడుకకు అవసరమైన కేక్ తీసుకొచ్చేందుకు వెళ్తుండగా మృత్యువు టిప్పర్ లారీ రూపంలో కబళించింది. ఫలితంగా ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన మేడికొండూరు మండలం పేరేచర్ల సత్తెనపల్లి రోడ్డులోని గుంటూరు బ్రాంచ్ కెనాల్ వద్ద గురువారం జరిగింది. మేడికొండూరు మండలం పొట్లపాడుకు చెందిన పి.వినయ్ చేబ్రోలు ఇంజినీరింగ్ కాలేజీలో చివరి సంవత్సరం చదువుతున్నాడు. అతని మేనత్త కొడుకు సత్తెనపల్లికి చెందిన జెట్టి శివభద్రినాథ్ మేడికొండూరు విశదల అడ్డరోడ్డు వద్ద గల ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇద్దరికి దగ్గర బంధువు అయిన అమ్మాయికి నిశ్చితార్థం పొట్లపాడు గ్రామంలో జరగనుండటంతో వారిరువురు కళాశాలకు సెలవు పెట్టి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వేడుకకు కేక్ అవసరం పడింది. కేక్ తెచ్చేందుకు వారిద్దరూ పేరేచర్లకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మార్గంమధ్యలో పేరేచర్ల కాలువ వంతెన వద్ద మట్టి లోడుతో లారీ వేగంగా వస్తూ ఎలాంటి ముందస్తు సిగ్నల్ వేయకుండా సడన్‌గా కుడి కాలుకట్ట వైపుకు తిప్పాడు. వేగనియంత్రణ కోల్పోయిన టిప్పర్ ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ద్విచక్రవాహనం లారీ వెనుక చక్రాల కింద పడిపోయింది. కింద పడిపోయిన వినయ్(20)ను లారీ కొంతదూరం ఈడ్చుకెళ్లింది. దీంతో అతని శరీరం రెండు భాగాలుగా విడిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శివ భద్రినాథ్‌కు అధిక రక్తస్రావం జరిగి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. సమాచారం తెలుసుకుని అక్కడకు చేరుకున్న మేడికొండూరు సీఐ అల్తాఫ్ హుస్సేన్ తీవ్రంగా గాయపడిన శివను వైద్యం నిమిత్తం ఆటోలో గుంటూరు ఆసుపత్రికి తరలించారు. అదే మార్గాన వెళ్తున్న మేడికొండూరు తహసీల్దార్ జి కరుణకుమార్ ప్రమాద సంఘటనను పరిశీలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఇరువురు కుటుంబీకులు అక్కడకు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. కొద్ది నెలలలో ఇంజినీరింగ్ చదువు పూర్తి చేసుకొని మంచి ఉద్యోగం సంపాదించి కుటుంబానికి అండగా ఉంటావని కన్న కలలు ఆవిరి చేశావా అంటు వినయ్ మృతదేహంపై పడి తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు చూపరులను కలచి వేసింది. మేడికొండూరు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు చంద్రిక ఎంపిక


చంద్రిక, ప్రతిమలకు కప్‌ను అందజేస్తున్న రమేష్, రాజారెడ్డి తదితరులు

తెనాలిఅర్బన్: ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అండర్–17 బాలికల వాలీబాల్ పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని స్కూల్ హెచ్ఎం కె.రాజారెడ్డి, పీడీ జె.రమేష్ తెలిపారు. జట్టులో తెనాలి చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినిలు వై.చంద్రిక, కె.ప్రతిమ పాల్గొని మంచి ప్రతిభ చూపించారని చెప్పారు. వై.చంద్రిక జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిందన్నారు. వీరిని గురువారం పాఠశాల ఆవరణలో అభినందించి కప్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెలగా సుభాష్‌చంద్రబోస్, అంబరీషుడు, డి.శ్రీనివాసరావు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.